# శ్రుతికావ్య కర్త బేంద్రే



ద.రా.బేంద్రే

**కస్తూరి... పరిమళాన్ని విస్తారంగా పంచినట్లు కన్నడ వైభవం 2007 నాటికే ఏడుసార్లు జ్ఞానపీఠ పురస్కారాన్ని తెచ్చిపెట్టింది. మరాఠీ వాడైనప్పటికీ దత్తాత్రేయ రామచంద్ర బేంద్రే కన్నడమే తన సర్వస్వంగా భావించి ఆధునిక కన్నడ కవితా పితామహుడుగా, కర్ణాటక కుల తిలకుడుగా, వరకవిగా ప్రశస్తి గాంచాడు. భారతీయ ఏకత్వతా నిరూపణకు మణిదర్పణంగా నిలిచాడు. విశ్వవ్యాప్తంగా ప్రతి కన్నడ గృహంలోను బేంద్రే పేరు సుపరిచితం. 'నాకుతంతి' కావ్యానికిగాను ఆయన ప్రఖ్యాత ఒరియా నవలాకారుడు గోపీనాథ్ మహంత్‌తో సంయుక్తంగా 1973లో జ్ఞానపీఠ పురస్కారం అందుకున్నారు.**

**బేం**ద్రే కర్ణాటకలోని ధార్వాడ్‌లో 1896 జనవరి 31న జన్మించాడు. తండ్రి రామచంద్రభట్, తల్లి అంబుతాయి. వీరిది పండిత కుటుంబం. పితామహుడు అప్పాభట్ దశగ్రంథి. రామచంద్రభట్ కూడా పండితుడే. వీరి పూర్వీకులు మహారాష్ట్రలోని కొలాబా జిల్లా కుంభారు గ్రామం నుంచి వచ్చి ధార్వాడ్ జిల్లా షిరహట్టిలో స్థిరపడ్డారు. బేంద్రే పన్నెండో యేటనే తండ్రిని కోల్పోవడంతో తల్లి, అమ్మమ్మ పెంచారు. 'పూటకూళ్ళ' నడిపి జీవనం సాగించారు. అందుకే తల్లిపేరు కలుపుకొని 'అంబికా తనయ దత్త'గా సాహితీ నామం పెట్టుకున్నాడు. ధార్వాడ్‌లోని విక్టోరియా ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణుడయ్యాడు. పుణె ఫెర్గుసన్ కళాశాలలో పట్టభద్రుడయ్యాడు. బాల్యంలోనే సాహిత్యాభిరుచితో కవితా రచన ప్రారంభించాడు. 'కర్నాటక మిత్ర' అనే లిఖిత పత్రిక నడిపాడు. భక్తి సాహిత్యం, రవీంద్రుని, అరవిందుని రచనలు కూలంకషంగా అధ్యయనం చేశాడు. బేంద్రే తను చదివిన పాఠశాలలోనే ఉపాధ్యాయుడుగా జీవనయాత్ర ఆరంభించాడు. లక్ష్మీబాయితో వివాహమయింది. ఆంగ్లేయ పాలనను నిరసిస్తూ, దేశభక్తి ప్రపూరితమైన 'నరబలి' అనే వ్యంగ్య రచన చేసి జైలు శిక్ష అనుభవించాడు. ఉద్యోగం పోయింది. పుణెలో పినతండ్రి వద్ద వుండి కన్నడం - ఇంగ్లీషులో ఎం.ఎ చేశారు. కౌటుంబిక జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురయ్యాయి. తల్లి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు మరణించారు. గడగేత, హుబ్లీలో కొంతకాలం ఉపాధ్యాయుడుగా పనిచేసి, పుణెలోని కామర్స్ కళాశాలలో అధ్యాపకుడుగా చేరాడు. చివరకు షోలాపూర్‌లోని డి.ఎ.వి. కళాశాల కన్నడ శాఖలో 1946లో ఆచార్య పదవి లభించింది. కష్టాలు వెన్నంటుతూనే వున్నాయి. కవిగా పైకివస్తున్న జ్యేష్ఠకుమారుడు రామచంద్ర ఆకస్మికంగా కన్ను మూశాడు. పన్నెండేళ్ల తర్వాత బేంద్రే ధార్వాడ్ తిరిగి వచ్చాడు. కేంద్ర ప్రభుత్వం 1956లో ధార్వాడ్ ఆకాశవాణికి సలహాదారుడిని చేసింది.




జీవితంలో ఎన్ని తీవ్ర సమస్యలెదురైనా బేంద్రే నిరంతర రచనాశీలిగా నిలిచారు. ఆయన తొలి కవిత 'తుత్తూరి'. 1917లో ప్రప్రథమంగా బేంద్రే కావ్యగానం చేసినప్పుడు రసజ్ఞ శ్రోతలు ఆయనలో భావి కవిశేఖరుణ్ని దర్శించారు. విమర్శకులు బేంద్రే కావ్య నిర్మాణ కాలాన్ని మూడు దశలుగా వర్గీకరించారు. అవి 1917-23 ఆరంభ దశ, 1923-56 పరిణతదశ, 1956-81 సముజ్జ్వల దశ. అతడి చాలా కృతుల్లో విశిష్టమైన సాంఖ్య దర్శన భూమిక ప్రస్ఫుటమవుతుంది. కన్నడంలో నూతన కావ్యధార రూపశిల్పుల్లో బేంద్రే ప్రముఖ స్థానం వహిస్తారు. భావకవిత్వానికి నూతన అన్వయాన్ని, కల్పనా విలసనాన్ని ఆయన కల్పించారు. తనను వ్యక్తిత్వ నిరపేక్షపూర్వక శ్రుత్యర్థంలో భావనిష్ఠ కవిగా చెప్పుకున్నారు. "మాతు మాతు మథిసి బంద నాదద నవనీతా" అంటారు బేంద్రే. అంటే ప్రతి పదాన్ని మథిస్తే జనించే నాద నవనీతం ఆనందప్రదం. మొదట బేంద్రే సంప్రదాయ బద్ధమైన షత్పది, అర్ధషత్పది ఛందం అవలంబించినా తర్వాత నూతన గేయ రూపాలు స్వీకరించారు. 'రాత్రిగె', 'జీవదగెళతి' వంటివి దీనికి ఉదాహరణలు. నూతనాభివ్యక్తి విధానాన్ని ఆయన ప్రవేశపెట్టారు. 'బెళగు' ఇందుకు చక్కటి తార్కాణం. 'చెట్ల, పొదల గళం నుంచి/ పక్షుల గానాలు వినిపిస్తున్నాయి/ అడివి నేల గంధర్వసీమగా మారింది'. కృష్ణకుమారి, గరి, మూర్తి, ఉయ్యాలె, నాదలీలె, సఖీగీతె, హాడు-పాడు, హృదయసముద్ర, ముక్తకంఠ, చైత్యాలయ మున్నగు కృతుల్లో బేంద్రే తన కవితా వైదుష్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. అలంకారిక వైభవం, శైలీసౌందర్యం ఆవిష్కరించే ఈ కావ్యాలలో వస్తువైవిధ్యం కానవస్తుంది. 'సఖీగీతె' దీర్ఘదాంపత్య సంబంధి కావ్యం. ప్రేమను ఎంత రసార్ద్రంగా చిత్రించారో ఆకలిని అంత శక్తిమంతంగా చూపారు: "గదరుత్తిహుదు గర్జిసుతిహుదు/ బడవర బగ్గర తుత్తిన చీలద/ ఒళగిన ఒళగిన దనియొందు." ఇవి 'తుత్తిన చీల' కవితలోని పంక్తులు. పేదల ఆకలి ఆక్రోశాలు నేలను కబళిస్తాయని గర్జిస్తున్నట్లు హెచ్చరిస్తాడు. 'కురుడు కాంచాణ' ఐశ్వర్యమదాంధతను గర్హిస్తుంది. 'హృదయసముద్ర', 'నాకు తంతి' మొదలైనవాటిలో ఆధ్యాత్మిక చింతన చోటుచేసుకుంటుంది. అరళు-మరళు, జీవలహరి, ఇదునభోవాణి ఇత్యాదుల్లో మానవ జీవిత విశ్లేషణ గోచరిస్తుంది. 'నిరాభరణ సుందరి' బేంద్రే కథారచన కౌశలానికి మచ్చుతునక. తిరుకర పిడుగు, ఉద్ధార, నగెయహొగె వంటి నాటకాలు, సాహిత్య మత్తు విమర్శె, సాహిత్య సంశోధనె, విచార మంజరి, సాహిత్యద విరాట్‌స్వరూప మొదలైన విమర్శ గ్రంథాలు కన్నడ సాహిత్యంలో అత్యంత ప్రామాణికంగా నిలిచాయి. భగ్నమూర్తి, ఉపనిషద్రహస్య, కబీర వచనావళి, గురుగోవిందసింగ్ వంటి అనువాదాలు ఇంగ్లీషు, హిందీ, బెంగాలీ, మరాఠీ భాషల్లో ఆయన పాండిత్యాన్ని నిరూపిస్తాయి. ఆయన ఇంగ్లీషు, మరాఠీల్లో కూడా మౌలిక రచనలు చేశారు. 38 కావ్యాలు, ఆరు నాటకాలు, ఒక కథాసంపుటి, 11 విమర్శగ్రంథాలు, పది అనువాదాలు, ఓ ఆంగ్లరచన, నాలుగు మరాఠీ గ్రంథాలు రాశారు.

1964లో వెలువడిన 'నాకుతంతి' జ్ఞానపీఠ పురస్కారం పొందిన మహాకావ్యం. ఇది ప్రతీకాత్మకంగా సాగిన తాత్త్విక కావ్యం. నవ్యమానవావిర్భావాన్ని ప్రకటిస్తుంది. బేంద్రే విశ్వమానవతను ఇందులో అన్వేషిస్తారు. ఆత్మౌన్నత్యాన్ని ప్రపంచీకరిస్తుంది ఇది. భారతీయ ఆధ్యాత్మిక భావ సారాన్ని నిక్షిప్తం చేస్తుంది. సార్వదేశికతను, ప్రజాస్వామ్య జీవన చైతన్యాన్ని ఉద్బోధిస్తుంది. ఇది 44 కవితల సమాహారం. నగరజీవనంలోని వికృతాలను చూపుతూ, అనర్థాలు నశించి నవానందం మోసులెత్తాలని చాటే కావ్యమిది. 'నాకు తంతి' అంటే నాలుగు తంత్రులని అర్థం. బేంద్రే కవితల్లో దీనికి మకుటస్థానం. విశ్లేషకులు దీనిని గొప్ప శ్రుతి కావ్యంగా వర్గీకరించారు. నేను, నీవు, అతను, ఆత్మ- ఈ నాలుగు పదాల తాత్త్విక, సామాజిక చతుర్ముఖాభివ్యక్తి ఈకావ్య వస్తువు. బీజాక్షరమంత్రం అంతర్నిహితమైవుంది. కవి మాటల్లోనే.. 'నాకుతంతిలోని నాలుగు భాగాలు ఒకే భావంలోని నాలుగు అభివ్యక్తులు. మొదటిది నాదప్రధానం. రెండవది భావచిత్రమయం. మూడోది ప్రశ్నోత్తర రూపం. చివరిది మొదటిదానిపై భాష్యం. ఇవే నాలుగు తంత్రులు' అందులోని కొన్ని పంక్తులు.. 'నేను నీవు మధ్య పోరాటం/ ఎమిటో నాకు తెలియదు/ నాలుగు తంత్రుల వాద్యంలో/ నాలుగు స్థానాల నాలుగు నాదాలు/ ఒక్కటైపోతాయి.'

కన్నడ సాహితీ రంగానికి బేంద్రే చేసిన మహత్తర సేవ 1923లో 'గెళెయరగుంపు' మైత్రీ సంఘాన్ని స్థాపించి, కన్నడ సాంస్కృతిక చైతన్యాన్ని, స్వాతంత్ర్య సమరోత్సాహాన్నీ ఉద్దీపింపచేయడం. బేంద్రే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, ఫెలోషిప్ పొందారు. ఆయనకు కేల్కార్ బహుమతి, మైసూరు, కర్నాటక విశ్వవిద్యాలయాలు, కాశీవిద్యాపీఠం గౌరవ డాక్టరేట్లు, భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' గౌరవం, హైదరాబాద్ హిందీ ప్రచార సభ 'సాహిత్యచార్య' బిరుదం లభించాయి.

వరకవిగా, కర్నాటక కవికుల తిలకుడుగా సాహితీలోకం శాశ్వతస్థానం సమకూర్చుకున్న ద.రా.బేంద్రే 1981 అక్టోబరులో దివంగతులయ్యారు. కవిగా అమరుడయ్యారు.

**–గోవిందరాజు రామకృష్ణారావు**